# స్వార్థత్యాగి

—శ్రీ చలసాని రామారాయ్

ఫ్యాక్టరీ పొగగొట్టంలోనుంచి పొగ మహావేగంగా వస్తోంది. చుట్టుపట్ల రెండు, మూడు ఫర్లాంగుల మేర ఆకాశంలో యిదే ఒక మేఘంలాగ క్రమ్మేసింది. ఫ్యాక్టరీ వర్కు, పైనుంచి వచ్చేపొగను బట్టే చెప్పొచ్చు.

కూలీలంతా పనిచేస్తున్నారు పొగలలో, మరలలో, భయంలేకుండా. మేనేజర్లు, మేనేజింగు డైరెక్టరు, ఇంకా పెద్ద అధికారులు ఫ్యాక్టరీ అంతా ఒకసారి బలాదూర్—తనిఖీ—కొట్టివచ్చారు.

అందులో మేనేజింగు డైరెక్టరుగారు, కూలీలు ఫ్యాక్టరీ ఆవరణలో ఒకచోటభోంచేస్తోంటే, 'ఒరేయి! మిమ్మల్ని యీరోజు లగాయతు యిక్కడ కూడు తిన్నారంటే చీల్చేస్తా!' నని హుంకరించారు.

ఆకూలీలు, పాపం! ఆనోటికి భయపడితినే భోజనంతోకూడ లేచిపోయి కాలువగట్టున పారవేసి కాలువలో గిన్నెలు కడుగుకొని మళ్లా వచ్చారు.

ఏంచేసారు? పాపం! ఏమైనా మాట్లాడితే వాళ్లకు వచ్చే జీతం డబ్బులకు నీళ్ళుపోయవలసిందే!

◆ ◆ ◆

ఆ ఫ్యాక్టరీలోనే పనిచేస్తున్నాడు మురళీధర్. అతను కొద్దిగా ఆస్తివున్నవాడు. వాళ్ల తలితండ్రులకు ఒక్కడే అతను కొద్దో గొప్పో డిగ్రీకూడ సంపాదించాడు. బానిసోద్యోగాలు యిష్టంలేక ఫ్యాక్టరీలో, స్వతంత్రంగా, యేదైనా వ్యవసాయ సంబంధ విషయాలు నేర్చుకొందామని గోయింగుశాఖలో చేరాడు. రైతుబిడ్డ కాబట్టి వ్యవసాయం అంటే ఇష్టం.

తన డ్యూటీ రెగ్యులర్ గా చేస్తున్నాడు. అలా ఒక నెల రోజులు గడిచాయి.

ఫ్యాక్టరీ బాగా వర్కు చేస్తోంది. కూలీలకు, పనివాళ్లకు, ఆఫీసు గుమాస్తాలకు పనికావలసినంతవుంది. అధికార్ల దౌర్జన్యాలకుకూడ మితంలేకుండవుంది, మురళి యిదంతా చూస్తున్నాడు ప్రతిరోజూ. అతనికి మాటల సందర్భాల్లో అతని మిత్రులు ఫ్యాక్టరీలోజరిగే ఘోరాలన్నీ చెపుతుండేవారు. అన్నీ విని వూరుకునేవాడు కాడు. వాళ్లని ప్రోత్సహించి 'ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్' ఒకటి స్థాపించాడు.

ఫ్యాక్టరీలోనున్న పనివాళ్లంతా సంఘంలో సభ్యులుగా చేరారు. మురళి నాయకత్వాన.

ప్రతివారం మీటింగులు జరుపుతున్నారు. పనివాళ్లకు, అధికార్లచేత, చెప్పుదెబ్బలు, చీవాట్లుకూడ వస్తున్నాయి వారి సరదాకోరకు.

◆ ◆ ◆

ఒకనాడు కూలీలంతా, ఉదయం ముఖా, వచ్చి ఆఫీసు ముందున్నారు. వాళ్లను మేనేజరుగారు రమ్మన్నారు అప్పుడు. రాత్రిముఖా వాళ్లది. వాళ్లు చస్తూ బ్రతుకుతూ వచ్చారు మేనేజరుగారి ఉత్తరువు ప్రకారం. వచ్చినతర్వాత మళ్లా రాత్రికే రమ్మన్నారు.

అధికార్ల దయ కూలివాళ్ళ ప్రాప్తి.

ఇటువంటివన్నీ యూనియన్ లో గోల పెట్టుకొన్నారు.

◆ ◆ ◆

ఈ చదువురాని కూలీలకు, నిష్కపట హృదయులకు, అమాయకులకు, మురళి తనకు ఖాళీవున్నప్పుడల్లా పత్రికలు—విజ్ఞానా నిచ్చేవి— చదివి వినిపిస్తూండేవాడు. ఇతర ఫ్యాక్టరీల కూలీలు వాళ్లకష్టాలెలా తీర్చుకొన్నారో వివరిస్తూండేవాడు. అధికార్లను బ్రతిమాలేవాడు కూలీల కష్టాలుచూచి. వాళ్ళను కనికర్రించమనేవాడు.

వాళ్ళుకూడ, వాళ్లలాగే— అధికార్లవలె— మనుష్యులేనని చెపుతుండేవాడు.

◆ ◆ ◆

కూలీల గ్రామలకెళ్లి వాళ్లకు ఆరోగ్యాన్ని గురించి ఉపన్యాసాలు చెపుతుండేవాడు. ఒకనెలదినాలలో వాళ్ళకు తీవ్రమైన చైతన్యం కలిగించాడు.

కూలీలు, వర్కర్లు అంతా మురళి నాయకత్వం క్రింద ఐక్యకంఠంతో 'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదాన్ని వినిపించేవారు అధికార్లకు.

మురళి స్నేహితులుకూడ కుడిచేయిగా పని చేస్తున్నారతనికి. అతనంటే ఫ్యాక్టరీ వర్కర్లందరకూ ప్రాణం. కాని అధికార్లకు కంటకం ఇక వాళ్ల ఆటలు సాగిరావని.

మురళి, వర్కర్లకు తదితర గ్రామాల్లో తమ తోటి సోదరకూలీలకు కూడ యీవిషయాలన్నీ చెప్పి వారి సానుభూతి సంపాదించేలాగు చేసాడు.

మిత్రులతో కలిసి వెళ్ళి ప్రచారంచేసి చుట్టుపట్ల గ్రామాల్లో రైతుల సానుభూతి సంపాదించేడు.

తను తన పనికూడ నియమంగా ఏమాటు ఏమరిపాటులేకుండా చేస్తున్నాడు అధికార్లకు ఏమాత్రం అలుసు లేకుండ.

◆ ◆ ◆

ఒకనాడు పెద్ద బహిరంగసభ ఏర్పాటుచేశారు ఫ్యాక్టరీ ముందు.

కష్టసుఖాలన్నీ చర్చించి తక్కిన ఫ్యాక్టరీ కూలి సోదరులు సమ్మెచేసి జయంపొందినట్టే వీరుకూడ సమ్మె చేసి జయంపొందటానికి నిశ్చయించారు.

ఆ సభలో:

"సమ్మెలోనే సొగసుయున్నది
సూటిగా యోచించరా!
..........................
..........................
సమ్మెయేమన సాహుకార్లకు
సుత్తిదెబ్బగ తగులురా!
సమ్మెయే కూలీలకెల్లను
చక్కని గురుమంత్రము;
అన్నా! కూలీలేకము కావలెరా॥"

అని పాడారు.

ఆపాటలోని ఒక్కొక్కమాట ఫ్యాక్టరీ యజమాన్లకు ఒక్కొక్క బాణంలాగ నాటుకొన్నాయ్.

యూనియన్ కార్యనిర్వాహకవర్గం అధికార్ల వద్దకు వెళ్లారు. కడపటి ప్రయత్నం. సంధికోసం శక్తికొలదీ ప్రయత్నించారు. ఏమాత్రం లాభంలేకపోయింది. పైపెచ్చు చీవాట్లు, అనవసరమైనద్వేషం ప్రబలినాయ్.

◆ ◆ ◆

సమ్మె ప్రారంభమయింది. కూలీలు పనిలోనికి వెళ్ళటంలేదు. ఫ్యాక్టరీ మంచిపనిలో వుంది. మంచి సమయం.

కూలీల ఊరేగింపు బయలుదేరింది ఫ్యాక్టరీవద్దనుంచి. ఫ్యాక్టరీలో అక్కడక్కడ, అధికార్లకు భయపడినవాళ్ళు, అధికార్లకు దగ్గరదృష్టిలో వున్నవాళ్ళు తప్ప యెవ్వరూలేరు.

ఫ్యాక్టరీ ఆపివేయాల్సొచ్చింది. వచ్చిన సరుకంతా నిల్వవుండిపోతోంది.

"విప్లవం వర్ధిల్లాలి!" అని వేసిన కేక చుట్టుపట్ల నాల్గయిదు గ్రామాలవరకు వినిపించింది. యీకేకకు ఝుడిసి ఫ్యాక్టరీపొగకూడ గొట్టంలోనే ఆగిపోయింది. సూర్యుడు మబ్బుచాటుకు పోయాడు.

◆ ◆ ◆

కూలీ గీతాలు పాడుకొంటూ ఊరేగింపు ముగించారు. జే జే ధ్వనులతో తిరిగి ఫ్యాక్టరీ ముందు సమావేశమయారు.

అధికారులకేమి తోచుటలేదు. సమ్మెచూస్తే చాల బలంగా వుంది. దాన్ని ఆపడం చాల కష్టం యేది దారి?

సభంతా యేకగ్రీవంగా 'సమ్మె వర్ధిల్లాలి!' అని కేక వేసారు.

సమ్మె తీర్మానాన్ని అంతా యేకగ్రీవంగా ఆమోదించారు.

◆ ◆ ◆

ఆమర్నాడు మురళిని, అతని స్నేహితులను—యీసమ్మెకు కారకులని అనుమానం వున్నవారిని—పనిలోనుంచి తొలగించారు.

అన్నింటికీ వున్నారుగా యేలేసిన జమానులు లాగ! ఊఁ అంటే వచ్చిపడతారు మీద. కూలీలంతా ఫ్యాక్టరీముందు మళ్ళీ—ఊరేగింపు అనంతరం కూడేటప్పటికి యిక్కడ యీపటాలం తయారైంది. గేట్ల దగ్గర ఎవ్వరినీ నిల్వనీయటం లేదు.

పొరుగూళ్ళకు లారీలనుపంపారు కూలీలకోసం. రెట్టికిరెట్టి, వీలు లేకపోతే మూడురెట్లుకూడ కూలి యిచ్చి—ఆడబ్బుకు ఆశపడి వచ్చేవాళ్ళని యెక్కించుకొస్తోంది ఒక లారీ. యీసంగతి తెలిసిన కూలీలు మాత్రం యెవ్వరూ రాలేదు.

ఫ్యాక్టరీముందు జనం యిసుకవేస్తే రాలకుండా వున్నారు. కూలీలు, వినోదంగా చూట్టానికి వచ్చిన పెద్దలు, రైతులు, సానుభూతి చూపించే తోడికార్మికులు నానావిధమైన జనులు వున్నారు.

ఆలారీ మూడుమైళ్ళదూరంవినిపించే మోతతో ఆ జనసమూహంలోనుంచి దారిచేసుకొని వస్తోంది. కూలీలంతా హాహాకారాలు చేస్తున్నారు. గోల, హేళన చేస్తున్నారు. లారీలో కూలీలను దిగవద్దని హెచ్చరిస్తున్నారు.

లారీ గేటుసమీపంలోకి వచ్చింది. మురళీ, గోపాల్ వగైరా అక్కడేవున్నారు. లారీని యెలాగైనా ఆపాలని మురళీ గేటుదగ్గరకు పరుగెత్తికెళ్లి అడ్డంగా పడుకొన్నాడు. అతనితో గోపాల్ కూడ పడ్డాడు.

యేమాత్రం దయాదాక్షిణ్యాలులేకుండ ఘాతుక మృగాలుకంటె ఘాతుకంగా ఆ నిర్దయులు, కఠిన పాషాణహృదయులు, వాళ్లిద్దరిమీదుగా లారీని తోలమన్నారు. డ్రైవరు జంకాడు. కాని అధికారి ఆజ్ఞ అనుల్లంఘనీయం. చేతుల్లో సత్తువలేకుండానే, ప్రాణాలున్నాయి, లారీని...............

ఈ దృశ్యం, అంతా నిర్ఘాంతపోయి జూస్తున్నారు. సమూహంలో హాహా కారాలు బయలుదేరినై. యజమానులు వెంటనే గేటు మూసేశారు.

లోపల అధికారులకు గుడ్డలు చెడుతున్నై. సమ్మె సమూహానికి పట్టుదల మరింత యెక్కువైంది. గోపాల్ కొనవూపిరితో వున్నాడు. కాని మురళీ ఈ భౌతిక ప్రపంచంలో లేడు. యీ ఇద్దరినీ హాస్పిటలుకు చారవేశారు. అదృష్టవశాత్తు గోపాల్ బ్రతికి బయటపడ్డాడు కొంతకాలానికి.

మురళీ, తనతోటి సోదర కార్మికులకోసం, ధనమదాంధకారంలోవున్న యజమానుల దౌర్జన్య దుర్మార్గానికి బలియై వాళ్లకు గుణపాఠం నేర్పాడు.

ఆ ఫ్యాక్టరీ చరిత్రలో మురళిపేరు 'స్వార్థత్యాగి' అని సువర్ణాక్షరాలతో వ్రాయబడింది.

♦ ♦ ♦

కూలీలు ఫ్యాక్టరీపని మానేశారు. ఫ్యాక్టరీకి నష్టంవచ్చేలాగుంది. అధికారులకు యిపుడు హృదయం కలిగింది. కూలీల కోర్కెలన్నీ తీర్చటానికి యిష్టపడి వాళ్లను బ్రతిమాలి జేర్చుకొన్నారు.

♦ ♦ ♦

మురళీ తలిదండ్రులకు పుత్రశోకం మితిలేకుండా వుంది. కాని వాళ్ళుమాత్రం యేంచేయగల్గుతారు? కుమిలి కృశించిపోతున్నారు.

♦ ♦ ♦

మిల్లు యజమానులమీద కార్మిక బృందం కేసు పెట్టారు—మురళీ ఖూనీ కేసు—

పలుకుబడి, కావలసినంత ధనం వీళ్లకు లేనందువల్ల కేసు చాలకాలం నడిచింది వాయిదాలమీద వాయిదాలతో.

అరెస్టుకాబడ్డ అధికారులు జుల్లా వచ్చారు యెక్కుబల్లు అయిన తర్వాత.

కోర్టుల గుళ్ళల్లో ధనపు సంచులు గుమ్మరించి తప్పించుకుందామని ప్రయత్నిస్తున్నారు.

అలా రెండు కోర్టులు దాటారు.

అప్పటికి మురళికి రెండు స్మారక దినోత్సవాలు జరిగాయ్.

కాని—

కార్మికులు తమ పట్టుదల వదలలేదు. మూడో కోర్టుకు—ఆఖరు ప్రయత్నం— అన్ని ఆశలూ వదలుకొని—యించుమించుగా—అప్పీలు చేసారు.

కాలం ఎప్పుడూ ఒకేరీతిగా వుండదుగా!

♦ ♦ ♦

ఆనాడు—లారీని తోలమన్నప్పుడు—నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా, పసువుల్లాగా యజమాన్ల ఆజ్ఞననుసరించి జరిగిన ఘాతుక కృత్యదృశ్యం గాలిలోకలిసిపోలేదు. మానవుల నోట్లోపడి నలిగిపోలేదు.

శాశ్వతచిత్ర రూపందాల్చింది.

అది యిన్నాళ్లకుగాని బయటపడలేదు. ఇప్పటికైనా సమయం మించిపోకుండా దొరికింది. అందుకు సంతోషించారు.

ఫ్యాక్టరీ అధికారులు కేసు తప్పిపోయిందని సంతోషిస్తున్నారు, ఇటువంటివి ఎన్నైనా చేయొచ్చునని, చేసినా ఏమి చేయరనీ ధైర్యంతో.

ఆ అప్పీలు సమయంలో ఫొటోకూడ జత చేశారు.

ఋజువులు తప్పించుకోవటానికి వీలులేక పోయింది. పాపం! చిక్కుపడ్డారు.

♦ ♦ ♦

మేనేజింగు డైరెక్టరుగారికి......శిక్ష......ద్వీపాంతరం.

కేసు పాతపడినా శిక్ష పాతపడుతుందా? తప్పుతుందా?

ఈచేత చేసిందాచేత అనుభవించాల్సిందే!

♦ ♦ ♦

మురళికి మూడవ స్మారకదినోత్సవం ఆవేళ.

పాపం! మేనేజింగు డైరెక్టరుగారు వెళ్లేరోజు......చిత్రం......కాలమహిమ!